


కోనాపూర్ తండాలో చిరుత కలకలం

రామయంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనాపూర్ చిన్నతండాలో చిరుత కనిపించిందనే వార్తలు కలకలం సృష్టించాయి. తండా శివార్లలో శనివారం తెల్లవారుజామున చిరుత సంచరిస్తుండగా వాటర్‌మెన్ చూశారు. భయంతో తండాలోకి పరిగెత్తి స్థానికులకు సమాచారమిచ్చారు. రామాయంపేట ఫారెస్ట్ రేంజర్ విద్యాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకొని చిరుత అడుగుజాడలను గుర్తించారు. చిరుతను తరిమేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ అధికారులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమీక్ష




సంగారెడ్డిలోని ఐబీలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సమావేశంలో పాల్గొన్న ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్ అధికారులు

సంగారెడ్డి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ఐబీలో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ అధికారుల టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి టౌన్‌లో ఉమెన్స్ డిగ్రీ కళాశాల నిర్మాణ పనుల పురోగతిని జగ్గారెడ్డి అడిగి తెలుసుకున్నారు. మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్‌లో అదనపు వసతిగదులతో పాటు 300 మంది విద్యార్థినులకు సరిపోయేలా కిచెన్, డైనింగ్ రూమ్‌లు, మూడంతస్తుల్లో ఏర్పాటు అయ్యేలా బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థుల అవసరాలమేరకు మినీ ఆడిటోరియం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మహిళా జూనియర్ కళాశాల కోసం ప్రత్యేక హాస్టల్ భవనానికి ప్రతిపాదనలు రెడీ చేయాలని సూచించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాత్‌రూమ్‌లు, అవసరమైన ఇతర మరమ్మతుల కోసం కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలి జగ్గారెడ్డి ఆదేశించారు. సంగారెడ్డి పట్టణంలోని బాలికల ప్రైమరీస్కూల్, గర్ల్స్ జూనియర్, గర్ల్స్ డిగ్రీ కాలేజీల్లో కావాల్సిన అన్ని మరమ్మతు పనులకు అంచనాలు రూపొందించాలని సూచించారు. సదాశివపేట పట్టణంలో కేజీబీవీ పాఠశాలలో ఓల్డ్‌బ్లాక్‌లో అవసరమైన ప్రధానమైన మరమ్మతులకు సైతం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోపాజీ అనంతకిషన్, కూన సంతోష్, షఫీ, కిరణ్‌గౌడ్, మహేశ్, ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డీఈ రాజు, ఏఈలు రాజమల్లయ్య, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

శ్రామికులు.. సంపద సృష్టించే కష్టజీవులు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

రామాయంపేటలో సీఐటీయూ 15వ జిల్లా మహాసభలు

7



బ్యాతోల్ నుంచి బీదర్‌కు ఫిల్టర్ ఇసుకను తరలిస్తూ శనివారం పట్టుబడిన టిప్పర్

మా దారి బీదరే..

సరిహద్దు దాటిస్తుండగా మరోసారి పట్టుబడిన ఫిల్టర్ ఇసుక లారీ

అధికారుల హెచ్చరికలపై ఫిల్టర్ ఇసుక వ్యాపారుల బేఖాతరు

చర్చనీయాంశంగా ‘ఆంధ్రజ్యోతి’ కథనం.. నేర సమీక్షలో ప్రస్తావించిన ఎస్పీ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 3: ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. ఎన్ని అడ్డంకులు ఎదురొచ్చినా తమ దారి బీదర్ వైపే.. అంటూ ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఎలాంటి బిల్లులు, రశీదులు లేకున్నా దర్జాగా రోడ్డెక్కి సంగారెడ్డి నుంచి బీదర్ వైపు దూసుకెళ్తున్నారు. అక్రమార్జనకు అలవాటుపడి నక్కవాగు నుంచి తయారు చేసిన నాసిరకం ఇసుకను రాష్ట్రాలు దాటిస్తున్నారు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఫిల్టర్ ఇసుక అక్రమ రవాణాపై ‘బీదర్‌లో బేరం’ అనే శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో శనివారం ఉదయం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు మరో ఇసుక లారీ పట్టుబడింది. ఈ లారీకి కూడా ఎలాంటి బిల్లులు, రశీదులు, పత్రాలు లేవు. గడిచిన 20 రోజుల వ్యవధిలో ఐదుసార్లు ఫిల్టర్ ఇసుక లారీలు పట్టుబడటం గమనార్హం.

బ్యాతోల్ టు బీదర్

కంది మండలం బ్యాతోల్ గ్రామంలోని నక్కవాగు పరిసరాల్లో తయారు చేసిన ఫిల్టర్ ఇసుకను టిప్పర్లలో బీదర్‌కు తరలిస్తున్నారు. తాజాగా పట్టుబడిన టిప్పర్ సైతం బ్యాతోల్ నుంచి బయల్దేరినదే. సంగారెడ్డి జిల్లాలో టిప్పర్ ఇసుకను విక్రయిస్తే రూ.30వేలు మాత్రమే వస్తుండగా.. బీదర్‌లో విక్రయిస్తే రూ.50వేలు గిట్టుబాటు అవుతుంది. అందుకే ప్రతీరోజు పదుల సంఖ్యలో టిప్పర్లను బీదర్‌కు తరలిస్తున్నారు. ఒకవేళ పట్టుబడినా జరిమానాలు చెల్లించి మళ్లీ దందా ప్రారంభిస్తున్నారు. ఇది నిత్యకృత్యంగా మారుతోంది. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట, కంది మండలం బ్యాతోల్ నుంచే పెద్ద సంఖ్యలో టిప్పర్లు బీదర్‌కు బయల్దేరుతున్నట్లుగా తెలుస్తోంది.

‘ఆంధ్రజ్యోతి’ కథనంపై చర్చ

సంగారెడ్డి నుంచి బీదర్‌కు వందల లారీల్లో అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తరలిస్తున్న విషయంపై ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాంతంలో సాగుతున్న అక్రమ దందా బీదర్ దాకా పాకిందా అంటూ గుసగుసలాడారు. అంతేగాకుండా శనివారం జరిగిన జిల్లా స్థాయి క్రైమ్ మీటింగ్‌లోనూ ఆంధ్రజ్యోతి కథనం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశించినట్లు సమాచారం. ఇసుక అక్రమ రవాణాపై నిఘా పటిష్ఠం చేయాలని సూచించినట్లు తెలిసింది.

వైద్యశాఖలో ఉద్యోగాలకు పోటెత్తారు

- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ
- చివరి రోజు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభ్యర్థులు

సంగారెడ్డి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి ఉద్యోగార్థులు తరలివచ్చారు. జిల్లాలో 117 పోస్టుల భర్తీకి గత నెల 28న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. శనివారంతో చివరి రోజు కావడంతో సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయానికి పెద్దఎత్తున అభ్యర్థులు తరలివచ్చి దరఖాస్తు చేసుకున్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణం సందడిగా మారింది.



దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులు

పారదర్శకతపై అనుమానాలు!

వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీ కోసం విడుదల చేసిన తాజా నోటిఫికేషన్‌పై అభ్యర్థులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన నియామకాల్లో రోస్టర్, మెరిట్‌ను పట్టించుకోకుండా పైరవీలతో ఉద్యోగాలు కట్టబెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈసారి నియామకాలపైనా అభ్యర్థుల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



‘భూ భారతి’

పైలెట్ కొండాపూర్

- 24 రెవెన్యూ గ్రామాల్లో రేపటి నుంచి గ్రామసభలు
- మండలస్థాయి అధికారుల పర్యవేక్షణ
- పూర్తి రికార్డులతో హాజరు
- భూ సమస్యలకు సత్వర పరిష్కారం

కొండాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అమలోకి తీసుకువచ్చిన భూ భారతి చట్టం అమలుకు పైలెట్ ప్రాజెక్ట్‌గా సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం ఎంపికైంది. ఈమేరకు 5వ తేదీ నుంచి 19 వరకు గ్రామసభలు నిర్వహించాలని మండల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లలో మండల స్థాయి అధికారులు నిమగ్నమయ్యారు.

గ్రామసభల్లో పరిష్కారం

సంగారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న కొండాపూర్ మండలంలో 24 రెవెన్యూ గ్రామాల పరిధిలో మొత్తం 36,611 భూమి ఉంది. ఇందులో పట్టాభూమి 29,860 ఎకరాలు, ప్రభుత్వ భూమి 6,794 ఎకరాలు, వ్యవసాయేతర భూమి 4,428 ఎకరాలు ఉంది. 15వేల మంది పట్టాదారులు ఉన్నారు. ధరణి పోర్టల్ ప్రవేశపెట్టిన అనంతరం భూరికార్డుల్లో పలు సమస్యలు తలెత్తాయి. వీటినంత వరకు అధికారులు పరిష్కరించినా.. ఇంకా 330 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా తెచ్చిన భూభారతి చట్టం అమలుకు మండలాన్ని పైలెట్‌గా ఎంపిక చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్నవాటితో పాటు ఇంకేమైనా సమస్య లుంటే పరిష్కరించేందుకు అన్ని గ్రామాల్లో సభలకు నిర్వహించనున్నారు. రోజుకు రెండు రెవెన్యూ గ్రామాల్లో ఉదయం 9 నుంచి 4 గంటల వరకు ఈ సభలను నిర్వహించనున్నారు. ఆర్డీవో, తహసీల్దార్, మండలస్థాయి రెవెన్యూ అధికారులు, సర్వేయర్ ఆయా గ్రామాల సమగ్రమైన రెవెన్యూ రికార్డులతో సభలకు హాజరై సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారు.

పైసా ఖర్చు లేకుండా..

మండలంలో 12 రోజులు గ్రామ సభలు కొనసాగుతాయి. ఆయా సభల్లో సమస్యల పరిష్కారం కోసం వచ్చే పట్టాదారులు దరఖాస్తులతో పాటు సంబంధించిన జిరాక్స్ కాపీలు తీసుకువస్తే చాలు. నిజానిజాలపై గ్రామంలోనే విచారణ జరిపించి సత్వర పరిష్కారం చూపుతారు. అక్కడ పరిష్కరించేందుకు అస్కారం లేని దరఖాస్తులను జిల్లాస్థాయి ఉన్నతాధికారుల అనుమతితో నెల రోజుల్లోపు నిర్వహించే సభలో సమస్యను పరిష్కారించే విధంగా చర్యలు తీసుకుంటారని అధికారులు తెలియజేశారు.

సంక్షేమాభివృద్ధిలో ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలుకు పైలెట్ ప్రాజెక్ట్‌లుగా కొండాపూర్‌ను ఎంపిక చేయడంతో నిధుల మంజూరులో ప్రాధాన్యం దక్కుతున్నది. గ్రామానికి 326 ఇందిరమ్మ ఇళ్లు, 44 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 187 కొత్త రేషన్‌కార్డులు, 32 మందికి కొత్త పింఛన్లు, రైతు భరోసా పథకం కింద 1,203 మంది రైతులకు రూ.95 లక్షలు ఒకే విడతలో మంజూరయ్యాయి.

రైతులకు అందుబాటులో..

భూ భారతి చట్టం అమలుకు పైలెట్ ప్రాజెక్ట్‌గా కొండాపూర్ మండలాన్ని ఎంపిక చేయడంతో సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం దొరికింది. ఈమేరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

-అశోక్, కొండాపూర్ తహసీల్దార్



మెదక్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

‘నీట్’కు సర్వం సిద్ధం

- నేడు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో 10 సెంటర్లు
- పరీక్ష రాయనున్న 4,690 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పోలీసుల పటిష్ట బందోబస్తు

7

అవసరమైన ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలు

- సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య
- కంది సెంట్రల్‌జైలులో ఆకస్మిక తనిఖీలు

7

విహారం.. విషాదం



- ప్రమాదాలకు నిలయంగా రిజర్వాయర్లు
- జనవరిలో కొండపోచమ్మసాగర్‌లో మునిగి ఐదుగురి మృతి
- తాజాగా రంగనాయక సాగర్‌లో ఇద్దరు..
- కనిపించని హెచ్చరిక బోర్డులు

7

పోలీసులపై దాడి

ఐదుగురిపై కేసు నమోదు

శివ్వంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని దూషిస్తూ చొక్కా పట్టుకొని దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశారు. మెదక్ జిల్లాలోని శివ్వంపేటలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఎస్సై మధుకర్‌రెడ్డి వెల్లడించారు. మండల కేంద్రమైన శివ్వంపేట గ్యాస్‌గోదాం సమీపంలో కానిస్టేబుళ్లు మహేందర్, సుధాకర్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. గోమారం గ్రామానికి చెందిన రషీద్, బిజిలీపూర్ పరిశ్రమలో పనిచేస్తున్న గుంటూరుకు చెందిన వలస కూలీలు బనావత్ సైదానాయక్, బూక్యా భీమానాయక్, గుగులోత్ గోపినాయక్, గుగులోత్ నందునాయక్ మద్యం సేవించి హెల్మెట్ లేకుండా రెండు ద్విచక్ర వాహనాలపై అతి వేగంగా వస్తున్నారు. వారిని ఆపి తనిఖీ చేస్తుండగా.. ఎందుకు ఆపారంటూ విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుళ్లు, ఏఎస్సై శ్రీనివాసును దూషిస్తూ చొక్కాలు పట్టుకొని దాడి చేశారు. ఈ ఘటనపై ఏఎస్సై ఫిర్యాదు చేయడంతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం చేయాలి

- రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్లను గుర్తించండి
- నేర సమీక్షలో సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ, హాజరైన పోలీసు అధికారులు

సంగారెడ్డి క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ బెట్టింగ్, యాప్స్, మోసాలు, డ్రగ్, ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించేందుకు ప్రజలను అప్రమత్తం చేసేందుకు కార్యక్రమాలను నిర్వహించాలని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలకు సూచించారు. ఆన్‌లైన మోసాలకు గురైనవారు సాధ్యమైనంత త్వరగా ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టిసారించాలని నిర్దేశించారు. ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు ప్రతీరోజు నిర్వహించాలని, మద్యం తాగి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. నంబర్ ప్లేట్లపై దృష్టిసారించి, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తూ అన్ని ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, ముఖ్యమైన కూడళ్లలో సీసీకెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చినవారితో మర్యాదగా మాట్లాడాలని, ఇబ్బందులతో వచ్చేవారిలో ధైర్యాన్ని నింపాలని సూచించారు. ప్రతీ కేసులో నాణ్యమైన దర్యాప్తు చేయాలని ఎస్పీ పంకజ్ పేర్కొన్నారు. అత్యాచార, పోక్సో కేసుల్లో వేగంగా విచారణ చేయాలని, నిర్ణీత గడువు లోపు దోషులను న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్టాలని చెప్పారు. వివిధ రకాల కేసుల పరిష్కారానికి ప్రతీ సర్కిల్ పరిధిలో స్పెషల్‌టీంలను ఏర్పాటు చేయాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, గంజాయి స్మగ్లర్లను కోర్టుకు అటాచ్ చేయాలన్నారు.



కుకునూర్‌లో వడ్ల తూకం వేస్తున్న కొనుగోలు కేంద్రం నిర్వాహకులు

కుకునూర్‌లో ధాన్యం తూకం ప్రారంభం

వెల్దుర్తి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుకునూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం ఎట్టకేలకు ప్రారంభమైంది. మూడు వారాలుగా కేంద్రం వద్దకు వడ్లు తీసుకువచ్చి ఎదురుచూస్తున్న రైతులకు ఊరట లభించింది. కేంద్రాన్ని తెరిచినా సేకరణ ప్రారంభించకపోవడంపై శనివారం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన ‘కేంద్రాల్లో సౌకర్యాలు కరువు’ కథనానికి అధికారులు స్పందించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం ప్రారంభించినట్లు, లైట్లు, నీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు సొసైటీ సీఈవో అశోక్ తెలిపారు. ఇతర కేంద్రాల వద్ద కూడా రైతులకు సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. తూకం ప్రారంభించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

తిరుమలాపూర్ వంతెనపై నుంచి పడి వ్యక్తి మృతి


మృతి చెందిన అనూప్

పెద్దశంకరంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలాపూర్ వంతెనపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని 161వ జాతీయ రహదారిపై జరిగింది. పెద్దశంకరంపేట ట్రైనీ ఎస్సై అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన బోయిని అనుప్(31) బైక్‌పై పెద్దశంకరంపేట నుంచి అల్లాదుర్గం వెళ్తుండగా ముందున్న బైక్‌ను వెనుకనుంచి వచ్చి ఢీ కొట్టాడు. దీంతో భయాందోళనకు గురై బైక్ వదిలి పారిపోతున్న సమయంలో వంతెనపై నుంచి కింద పడిపోగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. అనుప్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్సై అరవింద్ తెలిపారు.

కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతి

మాసాయిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున మాసాయిపేట మండలం కేంద్రంలోని షేర్ పంజాబీ దాబా వద్ద జరిగింది. చేగుంట ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌లోని అజ్మీర్ కోడాకు చెందిన జిగ్రీ ప్రహ్లాద్ 42 అనే లారీ డ్రైవర్ షేర్ పంజాబీ దాబా వద్ద రోడ్డు దాటుతూ ఉండగా కారు ఢీకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. శవాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి వెల్లడించారు.

వేచరేణి ఘటనలో ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

చేర్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేచరేణి గ్రామ శివారు ఎల్లదాసునగర్ కాలనీలో ఇటీవల చోటుచేసుకున్న దాడి ఘటనలో ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఎల్లదాసునగర్ కాలనీకి చెందిన వ్యక్తి ఇటీవల మద్యం మత్తులో గ్రామంలోని ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేయగా, స్థానికులు, హిందూ సంఘాల ప్రతినిధులు అతడికి దేహశుద్ధి చేసి, తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పగించారు. అయితే, ఈ విషయంలో వ్యక్తిపై దాడికి పాల్పడిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. దళిత సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. దాడికి పాల్పడిన ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామని, మరికొంతమందిని త్వరలో పట్టుకుంటామని ఏసీపీ తెలిపారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం ఘటనపై ఆరా తీశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

మృతుడు యాదాద్రి జిల్లా వ్యక్తి


మృతుడి (ఫైల్‌ఫోటో)

ములుగు, మే 3 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం బస్వాపూర్‌లో మృతి చెందిన వ్యక్తి కేసును 24 గంటల్లోనే పోలీసులు చేధిచారు. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై విజయ్‌కుమార్ నాలుగు బృందాలుగా ఏర్పడి మృతుడి ఆచూకీ తెలుసుకున్నారు. సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన దాచారం సాయికుమార్(25)గా గుర్తించారన్నారు. అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సాయికుమార్‌ను చంపి బస్వాపూర్ అడవి ప్రాంతంలో నిప్పంటించారు. శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చైన్ స్నాచర్‌కు దేహశుద్ధి

●నిందితుడిని పట్టుకుని అరిచిన మహిళ

జోగిపేట రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): మహిళపై దాడి చేసి బంగారు పుస్తెల తాడును దోచుకెళ్ళే ప్రయత్నం చేసిన దుండగుడికి స్థానికులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన సంగుపేట ఎక్స్ రోడ్ వద్ద జరిగింది. దీనికి సంబంధించి, జోగిపేట ఎస్సై పాండు కథనం ప్రకారం.. జోగిపేట పట్టణానికి చెందిన మాల నిర్మల అనే మహిళ, తన కూతురి రాక కోసం సంగుపేట చౌరస్తా వద్ద శనివారం ఉదయం నిరీక్షిసుంది. బైక్ పై అటుగా వెళ్తున్న పుల్కల్ మండలం మిన్పూర్‌కు చెందిన లస్కర్ సుభాష్ అనే యువకుడు, సదరు నిర్మల గొంతునులిమి, ఆమె ఒంటిపైనున్న బంగారు పుస్తెల తాడును దోచుకునే ప్రయత్నం చేశాడు. అయితే నిర్మల ప్రతిఘటించి నిందితుడు సుభాష్ చేతిని గట్టిగా పట్టుకుని అరవడంతో, స్థానికులు సుభాష్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిర్మల ఫిర్యాదు మేరకు సుభాష్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో స్నానానికి వెళ్లి యువకుడి మృతి

గుమ్మడిదల, మే 3 (ఆంధ్రజ్యోతి): చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్ రెడ్డి కథన ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్నూర్ గ్రామానికి చెందిన మిర్యాల ప్రసాద్ (20) అనే యువకుడు తన అన్న శివతో కలిసి రెండు సంవత్సరాల నుంచి బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతంలో చెత్త ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే, ఈనెల 1వ తేదీన ఉదయం ప్రసాద్ శివతో తాను మంగళషాప్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. ఆరోజు మధ్యాహ్నం అయినా తిరిగి రాకపోవడంతో ఎక్కడో చెత్త ఏరుకుంటూ ఉండచ్చని భావించారు. మూడో తేదీ బొంతపల్లి సమీపంలోని అలక చెరువులో ఓ యువకుడు నీట మునిగి చనిపోయి ఒడ్డున చేరాడని సమాచారం తెలియడంతో అన్న శివ అక్కడికి వెళ్లి చూడగా తన తమ్ముడే అని గుర్తించాడు. చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదం శాత్తు మృతి చెందాడని ఎలాంటి అనుమానం లేదని ప్రసాద్ అన్న స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై మహేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోడ యాదయ్య (48) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై ఇంట్లో గొడవ పడేవాడు. జీవితంపై విరక్తి చెందిన యాదయ్య శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఆసుపత్రికి తరలించారు.

నిరుపయోగంగా నీటి తొట్లు

● అల్లాడుతున్న మూగజీవాలు





కోహీర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఎండలకు చెరువులు, కుంటలు ఎండిపోవడంతో పశువులు నీటికోసం అలమటిస్తున్నాయి. వాటి దాహార్తి తీర్చేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో సింగిల్‌ఫేజ్ మోటర్లు, గ్రామానికి నీటి సరఫరా చేసే బోరు బావులు, ట్యాంకుల వద్ద పశువులకు తాగు నీటి తొట్లు నిర్మించారు. వాటి నిర్వహణ గాలికొదిలేయడంతో మండలంలోని పలు గ్రామాల్లో అవి నిరుపయోగంగా మారాయి. మరికొన్ని గ్రామాల్లో శిథిలావస్థకు చేరాయి. మండలంలోని బడంపేట పర్శపల్లి పైడిగుమ్మల్, బిలాల్‌పూర్ తదితర గ్రామాల్లో నీటి తొట్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నీటి తొట్లను వినియోగంలోకి తేవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మరోవైపు కొన్ని గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నీటి తొట్లను నిర్మించాల్సి ఉండగా సరిపడా నిధులు మంజూరుకాక కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు. దీంతో మూగ జీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి.

శ్రామికులు.. సంపద సృష్టించే కష్టజీవులు

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



మహాసభలో మాట్లాడుతున్న చుక్క రాములు

రామాయంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): శ్రామికులు కట్టు బానిసలు కాదు.. దేశానికి సంపద సృష్టించే కష్టజీవులని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. మెదక్ జిల్లా రామాయంపేటలో శనివారం సీఐటీయూ 15వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సభకు హాజరైన ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాల్సింది పోయి.. 29 రకాల కార్మిక చట్టాలను రద్దుచేసి ఉరితాళ్లు బిగించేలా చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే వేరే దారి లేక ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక లోకం సన్నద్ధమవుతోందన్నారు. ప్రధానమంత్రి మోదీ పెట్టుబడిదారుల పక్షం నిలుస్తూ.. అసంఘటిత కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా శ్రామికుల సమస్యలు ఎండగట్టే లక్ష్యంగా అన్ని జిల్లాల్లోనూ వంతుల వారిగా మహా సభలు నిర్వహించి కార్మికుల పక్షాన తీర్మానాలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఐక్య పోరాటాల వల్లే సమస్యలు పరిష్కారం సాధ్యమని, అందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు బాలమణి, మల్లేశం, కె.నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు. మహాసభల్లో భాగంగా ఆదివారం రామాయంపేటలో కార్మికుల బల ప్రదర్శన సాగనుంది. వేలాది మందితో పట్టణ పురవీధుల గుండా రాష్ట్ర ప్రతినిధుల ఆధ్వర్యంలో కార్మిక ర్యాలీ నిర్వహించనున్నారు.

ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలందిస్తాం

● సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య
● కంది సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ



ఖైదీలకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

కంది, మే 3 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో చేసిన నేరాలకు శిక్షను అనుభవిస్తున్న ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలు అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలతో ఆమె శనివారం కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీల బ్యారక్‌లు, గదులు, వంటగది, బాత్రూంలు, జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించారు. ఖైదీలకు పెడుతున్న భోజనం రుచి చూశారు. ఖైదీల కోసం వండే కూరగాయలు, బియ్యం, ఉన్న స్టోర్‌రూమ్‌ని కూడా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.. జైలులో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్ పరిశీలించారు. ఖైదీలకు కావాల్సిన అవసరాలు, సదుపాయాలు అన్ని అందించేలా చూడాలని జైలు సూపరింటెండెంట్ సంతోష్‌రాయ్‌కు సూచించారు. అనంతరం ఆమె ఖైదీలతో సమావేశమై సమయానికి బెయిల్స్, ములాఖత్‌లు అందుతున్నాయా అని ఖైదీలను ఆరా తీశారు. ఆమె వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, జైలర్లు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఆధార్, పాన్‌కార్డుల తయారీ

● దుబ్బాకలోని బాలాజీ జిరాక్స్ సెంటర్‌పై పోలీసుల దాడి

దుబ్బాక, మే3(ఆంధ్రజ్యోతి): జిరాక్స్ సెంటర్ ముసుగులో నిర్వాహకుడు నకిలీ ఆధార్, పాన్ కార్డులు, ఆర్సీబుక్కులను తయారు చేస్తూ పోలీసులకు చిక్కాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాకలోని బాలాజీ ఆన్‌లైన్ కంప్యూటర్, జిరాక్స్ సెంటర్ నిర్వాహుడు సిరిమల్లె వేణుగోపాల్ టెక్నాలజీని ఉపయోగించి కంప్యూటర్, కలర్ ప్రింటర్‌ద్వారా నకిలీ గుర్తింపు కార్డులను తయారు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం ఆ సెంటర్‌లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి నకిలీ పాన్‌కార్డులు, ఆర్సీలు, ఆధార్‌కార్డులను గుర్తించారు. ఈ మేరకు కంప్యూటర్, సీపీయూ, జిరాక్స్ మిషన్, కలర్ ప్రింటర్ తోపాటు పలు చిప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

'నీట్'కు సర్వం సిద్ధం

● నేడు మ.2 నుంచి 5 గంటల వరకు నిర్వహణ
● ఉమ్మడి జిల్లాలో హాజరుకానున్న 4690 మంది అభ్యర్థులు
● అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
● పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు



పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం/సంగారెడ్డి రూరల్/సిద్దిపేట కల్చరల్/మెదక్ అర్బన్ , మే 3 (ఆంధ్రజ్యోతి) : నేడు నిర్వహించే నీట్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4690 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. సంగారెడ్డి జిల్లాలో 3320 మందికి ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 883 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఇక మెదక్‌లో తొలిసారిగా జరగనున్న నీట్ పరీక్షకు 487 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో ఐఐటీ కందిలో రెండు, తార ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో ఒకటి, జేఎన్టీయూ సుల్తాన్పూర్‌లో రెండు, కేంద్రీయ విద్యాలయం ఎద్దు మైలారంలో ఒకటి, సంగారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించినట్లు పేర్కొన్నారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. గదులను తనిఖీ చేసి సీసీ కెమెరాలు, జామర్ల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.

1.30 కే గేట్లు క్లోజ్..

విద్యార్థులు అడ్మిట్ కార్డు, ఏదైనా గుర్తింపు కార్డు(ఆధార్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ కార్డు, డ్రైవింగ్ లెసెన్స్)తో పాటు పాస్ పోర్టు సైజ్ ఫోటో తప్పని సరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విదానంలో పరీక్ష జరుగుతుందని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటలకు గేట్లు క్లోజ్ చేస్తారని, తర్వాత విద్యార్థులకు పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదన్నారు. పరీక్ష సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూరి చేసినట్లు వెల్లడించారు.పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు పెన్నులు, పెన్సిళ్లు, ఇతర ఎలాంటి వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకురావద్దని, పరీక్షా కేంద్రంలోనే పెన్నులు, పెన్సిళ్లు సమకూర్చనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్ష హాల్‌లోనికి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ వంటి ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు గంట ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచించారు.



సిద్దిపేటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

నీట్ పరీక్ష సందర్భంగా ఆంక్షలు

నీట్ పరీక్ష సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పలు ఆంక్షలు విధించినట్లు సంగారెడ్డి, మెదక్ ఎస్పీలు పరితోష్ పంకజ్, ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు సెంటర్ వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, రాస్తారోకోలు, ప్రచారాలకు అనుమతి లేదన్నారు. సెంటర్ పరిసరాల్లో 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి ఎక్కువ మంది గుమిగూడరాదన్నారు. పరీక్ష సమయంలో ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఏర్పాట్లను పరిశీలించిన గరిమా అగ్రవాల్

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ శనివారం పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట అదనపు డీసీపీ సుభాష్ చంద్ర బోస్, నీట్ పరీక్ష సిటీ కోఆర్డినేటర్ సూర్య ప్రకాష్, పరీక్ష నిర్వహణఅధికారులు తదితరులు ఉన్నారు.



రంగనాయకసాగర్‌లో గల్లంతైన కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

విహారం.. విషాదం

ప్రమాదాలకు నిలయంగా రిజర్వాయర్లు.. పలువురి మృత్యువాత
జనవరిలో కొండపోచమ్మసాగర్‌లో మునిగి ఐదుగురి మృతి
తాజాగా రంగనాయకసాగర్‌లో ఇద్దరు..
ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు

సిద్దిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): సరదాగా కాలక్షేపం కోసం రిజర్వాయర్లకు వస్తున్న సందర్శకులు ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడుతున్నారు. దీంతో విహారయాత్ర కాస్త విషాదయాత్రగా మారుతున్నది. ముఖ్యంగా సిద్దిపేట జిల్లాలో రిజర్వాయర్ల వద్ద ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. జనవరిలో జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మసాగర్ మునిగి హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు మృతి చెందగా.. తాజాగా శనివారం రంగానాయకసాగర్ రిజర్వాయర్‌లో మునిగి ఇద్దరు మృతిచెందారు. వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన రెండు కుటుంబాలు రిజర్వాయర్‌ను వీక్షించేందుకు రాగా బాలుడు, బాలిక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందారు. తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులకు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కనిపించని హెచ్చరిక బోర్డులు..

రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను వీక్షించడానికి సెలవురోజులు, వారాంతంలో సిద్దిపేట జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున సందర్శకులు తరలి వస్తుంటారు. రిజర్వాయర్ బోటింగ్ మెట్ల వద్ద పర్యవేక్షణ లేకపోవడం, సంబంధిత అధికారులు నీటి లోతును తెలిపే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో సందర్శకులు నీటిలో దిగి సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ, ఆడుతూ సందడి చేస్తున్నారు. గతంలో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయినా అధికారులు అప్రమత్తం కాకపోవడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా బోటింగ్ మెట్ల వద్ద సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన సిద్దిపేట ఏసీపీ..

రంగనాయకసాగర్ రిజర్వాయర్ సంఘటనా స్థలాన్ని సిద్దిపేట ఏసీపీ మధు పరిశీలించి ఎస్ఐ బాలకృష్ణను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సందర్శనకు వచ్చిన వారు నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

పారదర్శకంగా కమిటీల ఎన్నిక

● ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్

నర్సాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ను సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు పారదర్శకంగా కమిటీల ఎన్నికకు నిర్ణయించినట్లు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుసాయికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ నియోజకవర్గ స్థాయి సంస్థాగత ఎన్నికల సమావేశానికి ఆయనతోపాటు డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెట్టుసాయికుమార్ మాట్లాడుతూ పీసీసీ ప్రత్యేకంగా రూట్‌మ్యాప్ ద్వారా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆయా పార్టీ పదవులను పారదర్శకంగా నియమిస్తున్నదన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికే అందరి ఆమోదం మేరకు ఎంపిక చేస్తామన్నారు. పార్టీలో కీలక నిర్ణయాలు ఆయా కమిటీలే తీసుకుంటాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ పాయింట్లకు నోట్‌బుక్స్



సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకున్న నోట్‌బుక్స్

సంగారెడ్డి అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అందించే నోటు పుస్తకాలు పాఠశాలల పాయింట్లకు చేరుకుంటున్నాయి. ఏటా పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలను విద్యార్థులకు సర్కారు ఉచితంగా అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది పై నుంచి వడివడిగా సరఫరా అవుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరానికి (2025-26) సంబంధించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే పాఠ్య పుస్తకాలు కూడా ఇప్పటికే 52 శాతం జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక భారం తప్పించేందుకు ఏటా సర్కారు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న విషయం విధితమే. గతేడాది యూడైస్ ఆధారంగా 1-10 వ తరగతి వరకు అన్ని సబ్జెక్టు పుస్తకాలు, నోటు పుస్తకాలు సరఫరా చేస్తుండగా పాఠశాలల పునఃప్రారంభం నాటికి స్కూల్ పాయింట్లకు చేరవేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పత్తి సాగులో మార్పులపై దృష్టి సారించాలి

● సంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్

ఝరాసంగం, మే3(ఆంధ్రజ్యోతి) : పత్తి సాగులో తాజా మార్పులపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఝరాసంగం రైతువేదికలో అరణ్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పత్తి పంటను సాగు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేషం, అరణ్య సంస్థ సీఈవో పద్మ, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నవ్వు నలభై విధాల మంచిది

నవ్వడం ఒక యోగం.. నవ్వక పోవడం ఒక రోగం అన్నారు పెద్దలు. కానీ, నేటి ఉరుకు పరుగుల జీవితాల్లో మనుషుల ముఖాల్లో చిరునవ్వు మటుమాయమైపోతున్నది. ఒకప్పుడు నవ్వు నాలుగు విధాలా చేటు అనే వారు కానీ.. నవ్వు నలభై విధాలా మంచిది అంటున్నారు మానసిక వైద్య నిపుణులు. నిత్యం నవ్వితే శారీరక, మానసిక రుగ్మతలు దూరమై సంపూర్ణ ఆరోగ్యం దరిచేరుతుందంటున్నారు. ఈ నేపథ్యంలో నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

● శారీరక, మానసిక రుగ్మతలు దూరం
● సంపూర్ణ ఆరోగ్యానికి దివ్యౌషధం నవ్వు
● నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం


మెదక్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఏటా మే నెల మొదటి ఆదివారాన్ని ప్రపంచ నవ్వుల దినోత్సవంగా జరుపుకుంటారు. నవ్వులు ఎన్ని రకాలుగా ఉన్నా... చిరునవ్వు మాత్రం చాలా హుందాగా ఉంటుంది. చిరునవ్వులు చిందిస్తూ మాట్లాడేవారిని మంచి కమ్యూనికేటర్‌గా భావిస్తారు. అందుకే భావ వ్యక్తీకరణ నైపుణ్యాల్లో చిరునవ్వు సాధన చేయమంటారు. తిక్కన తన రచనల్లో 32 రకాల నవ్వులను వివరించారు. అందులో పక, పక నవ్వు, కిలకిల నవ్వు, వాళదస్మిత, హర్షానందస్మిత, కల కల నవ్వు, సాదర దరహాసం, వేత్త నవ్వు, కన్నుల నవ్వు, నవ్వు రాని నవ్వు తదితర నవ్వులు ఉన్నాయి.



నవ్వు ఒక దివ్యౌషధం...

నవ్వు ఏదైనా ప్రయోజనాలు మాత్రం అనేకం. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉచితంగా లభించే దివ్యౌషధం ఇది. నవ్వినప్పుడు మెదడులో డోపమైన్, ఆక్సిటోసిన్, సెరోటోనిన్, ఎండార్ఫిన్, రసాయనాలు విడుదలవుతాయి. చిరునవ్వులు చిందించే వారికి ఈ రసాయనాలు విడుదలవ్వడం వలన హాయిగా నిద్ర పడుతుంది. మానసిక ఆందోళన తగ్గుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, అభ్యసనా నైపుణ్యాలు పెరుగుతాయి. నవ్వు వల్ల నార్ ఎడ్రినలిన్ హార్మోన్ సమపాళ్లలో నియంత్రణలోకి వస్తుంది. దీంతో శక్తిని అందిస్తుంది. నవ్వుతో రోగ నిరోధక వ్యవస్థకు అవసరమైన లింఫొసైట్స్ ఉత్పత్తి పెరుగుతుంది. ముక్కు, శ్వాస కోశాల్లోని పొరల్లో మెరుగుదల ఉంటుంది. శరీరంలోని సహజ నిరోధక హార్మోన్ల ఉత్పత్తి పెరిగి ఆర్థరైటిస్, స్పాండిలైటీస్, మైగ్రేన్ లాంటి వ్యాధులకు ఉపశమనం లభిస్తుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం, రక్తంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతుంది. దీంతో అస్తమా రోగులకు మేలు జరుగుతుంది.

నవ్వుతో ఆందోళన దూరం..



నవ్వు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇటీవల కాలంలో ఎంతోమంది తమ బిజీ జీవితాల్లో నవ్వుకు దూరమవుతూ ఆరోగ్య సమస్యలకు దగ్గరవుతున్నారు. నవ్వడం వలన ఎన్నో సమస్యలనుండి ఉపశమనం పొందవచ్చు. హాస్యం వీడియోలు చూస్తూ ఆందోళనలను దూరం చేసుకోవాలి.

- సురేష్, మానసిక వైద్యనిపుణుడు, మెదక్

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

● లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలి
● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

కొల్చారం, మే 3 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కొల్చారం మండలం వెంకటాపూర్ గ్రామంలో గృహ నిర్మాణ శాఖ, మండల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల విచారణ ప్రత్యేక అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన కుటుంబాలకు న్యాయం జరగేలా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనలో ఎక్కడా కూడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సజావుగా సర్వే చేయాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా.. అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు అందేలా చూడాలన్నారు. అలాగే సర్వే చేసిన వివరాల పత్రాలను అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. పరిశీలన చేసే క్రమంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఏదేని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల వారీగా పరిశీలన పూర్తి కాగానే అర్హుల జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించాలని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తక్షణమే నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించాల న్నారు. విడతల వారిగా నిధులు మంజూరు చేయనున్నట్లు వివరించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

ఆలయంలో అన్నదానం

రామచంద్రాపురం టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం భారతీనగర్ డివిజన్ పరిధి ఎల్‌ఐజీ కాలనీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదర్శరెడ్డి పాల్గొన్నారు.

6 నుంచి క్రికెట్ వేసవి శిక్షణా శిబిరాలు

సంగారెడ్డి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా క్రికెట్ వేసవి ఉచిత శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు మెదక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 19, 23 వయస్సు గలవారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, జహీరాబాద్, గజ్వేల్‌లో నెలరోజుల పాటు శిబిరాలు జరుగుతాయని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు హెచ్‌వైక్రికెట్.ఓఆర్‌జీ లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

'ఎత్తిపోతలను వినియోగంలోకి తేవాలి'

నారాయణఖేడ్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మంజీరా నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తేవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి మనూరు మండలంలోని పుల్‌కుర్తి, శాపూర్, తోర్కాల్, కారముంగి, బోరంచ, న్యాల్‌కల్, మండలం అమీరాబాద్‌లో ఎత్తిపోతలను 25 ఏళ్ల క్రితం నిర్మించి, నేటికీ పొలాలకు నీరు అందించలేదన్నారు. ఆయా ఎత్తిపోతలను పునరుద్ధరించి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వమే తీసుకొని సాగునీటిని అందించాలన్నారు.

కుట్టు శిక్షణతో ఉపాధి

జహీరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కుట్టుశిక్షణతో మహిళలకు భవిష్యత్‌లో మరింత ఉపాధి లభిస్తుందని ఏపీసీసీ(ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివ్ కౌన్సిల్) అధికారి ప్రకాష్, కో ఆర్డినేటర్ సత్యం పేర్కొన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్, మాణిక్‌ప్రభు మహేశా తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న కుట్టు శిక్షణా కేంద్రాలను పరిశీలించారు.

మొరం అక్రమంగా తరలిస్తే చర్యలు

వట్‌పల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) : వివిధ పనుల నిమిత్తం మొరం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసరావు హెచ్చరించారు. వట్‌పల్లిలో మూడు టిప్పర్లలో మొరం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు శనివారం పట్టుకుని తమకు అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఒక్కో టిప్పర్‌కు రూ.5 వేల జరిమానా విధించామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మెదక్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ సింధురేణుక శనివారం తెలిపారు. హవేళిఘణపూర్ మండలం కూచన్‌పల్లికి చెందిన గౌండ్ల యాదగిరి గ్రామ శివారులో నక్కవాగు నుంచి తన ట్రాక్టర్‌తో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'వేసవిలో ప్రజలు జాగ్రత్త ఉండాలి'

చిన్నశంకరంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజలు జాగ్రత్త ఉండాలని వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యం ఎండల విపరీతంగా మండుతున్నాయన్నారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. ఎండదెబ్బ తగలకుండా తలకు రుమాలు ధరించాలన్నారు. కళ్లు, తల తిరిగినట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.



'జైబాపు-జైభీమ్' ర్యాలీలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి

'జైబాపు-జైభీమ్'లో నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డిటౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పిలుపు మేరకు సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఎన్కేపల్లిలో శనివారం 'జైబాపు-జైభీమ్'లో భాగంగా నిర్వహించిన మహార్యాలీలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. సదాశివపేట మండలంతో పాటు వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అన్నివర్గాల పేదలకు లబ్ధి చేకూరుతున్నాయని తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డిటౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకున్న పలువురికి రూ.15 లక్షల విలువ చేసే చెక్కులను టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేదలకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ అందజేసి భరోసా కల్పిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్‌కుమార్, మహేష్, శ్రీనివాస్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

సప్లిమెంటరీలో ఫలితాలు మెరుగుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ ఆఫీసర్ కిషన్‌చౌహాన్

సంగారెడ్డి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ సప్లిమెంటరీలో ఫలితాలు మెరుగుపడాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్, మెడ్చెల్ డీఐఈవో కిషన్‌చౌహాన్ సూచించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాళ్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ నెల 22 నుంచి జరిగే ఐపీఈ ఇమ్రూమెంట్, సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలని, విద్యార్థులందరూ పాస్ అయ్యేలా ఆన్‌లైన్ తరగతులు తీసుకోవాలని సూచించారు. ఒకటి, రెండు సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఐఈవో గోవిందరామ్, అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే

రామచంద్రాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి) : మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో రూ.30 కోట్లతో నిర్మించిన రిజర్వాయర్లను, 20 కిలోమీటర్ల పైపులైన్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అతివేగంగా విస్తరిస్తున్న మున్సిపాలిటీలో తాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పూర్తయిన రిజర్వాయర్లను 27న లేదా నెలాఖరుకు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ రిజర్వాయర్ ద్వారా 55 కాలనీలకు తాగునీరు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జల మండలి జీఎం సుబ్బారాయుడు, డీజీఎం చంద్రశేఖర్, శిరీష, తెల్లాపూర్ కమిషనర్ సంగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.రాములుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



రిజర్వాయర్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రోజు 500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాలి

- యావాపూర్ కేంద్రం తనిఖీలో ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్/చిన్నశంకరంపేట/చేగుంట/రేగోడు, మే 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్రాల్లో ప్రతిరోజు 500 క్వింటాళ్ల ధాన్యం తూకం వేసి కొనుగోలు చేయాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆదేశించారు. శనివారం తూప్రాన్ మండలం యావాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు రాకుండా కొనుగోళ్లు కొనసాగించాలని, ఇందుకు సెంటర్ ఇన్‌చార్జులు చొరవ తీసుకోవాలన్నారు. తూకం వేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసి వెంటనే రైసుమిల్లుకు పంపించాలని జయచంద్రారెడ్డి ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ విజయలక్ష్మి ఉన్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు సంగాయిపల్లి, తదితర గ్రామాల్లో సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మన్నన్ సందర్శించారు. చేగుంట మండలం వడియారంలోకొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు. రేగోడులో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం సంగీత పరిశీలించారు.



యావాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

వచ్చే ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటుతాం : మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వచ్చే స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటుతామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం నర్సాపూర్‌లో 'పంచతీర్థం నుంచి సమానత్వం' అనే కార్యక్రమంలో భాగంగా సీనియర్ సిటిజన్లు, ఇతర పుర ప్రముఖులను కలిసి బీజేపీ సిద్ధాంతాలు, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని వివరించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ బీజేపీతోనే అన్ని వర్గాలకు మేలు కల్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగేష్, రాంరెడ్డి, సంగసానిరాజు, బబ్బు హరికృష్ణ, శ్యామ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్‌కు బీజేపీ కార్యక్రమాలు వివరిస్తున్న మల్లేశ్‌గౌడ్

గంజాయి స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

- మరొకరు పరారీ
- మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఘటన

నర్సాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్‌లో కిలో 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. డీటీఎఫ్ సీఐ, నర్సాపూర్ ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ గోపాల్ వివరాల ప్రకారం.. తూప్రాన్-నర్సాపూర్ సర్కిల్ వద్ద గంజాయి అమ్ముతున్నట్టు సమాచారం మేరకు దాడిచేయగా.. గంజాయి లభించిందన్నారు. బీహార్‌కు చెందిన ముకంజా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోగా.. మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన నర్సింహులు పారిపోయాడని సీఐ తెలిపారు. హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి ఇక్కడ అధిక ధరకు విక్రయిస్తున్నట్లు ముకంజా ఒప్పుకున్నాడు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.లక్షన్నర ఉంటుందని సీఐ గోపాల్ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు: డీపీవో



చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీవో

చిన్నశంకరంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని డీపీవో యాదయ్య పేర్కొన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండలంలోని గవ్వపల్లి గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి, ఇళ్ల సర్వేను పరిశీలించి మాట్లాడారు. ఇళ్లు లేని పేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గరిజారాణి, పంచాయతీ కార్యదర్శులు రాజు, నాపల్లి, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

'వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి'

పెద్దశంకరంపేట/తూప్రాన్/చిన్నశంకరంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణా శిబిరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 15 రోజుల పాటు స్టిచ్చింగ్, యోగా, పాటలు, డ్రాయింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, సత్యకుమార్, సిద్దిరాములు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు. తూప్రాన్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యాశాఖ డైరక్టర్ ఆదేశాల మేరకు 6 నుంచి 9 తరగతి చదివే విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో పర్వతి సత్యనారాయణ తెలిపారు. తూప్రాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నశంకరంపేటలోని హైస్కూల్‌లో బాల, బాలికలకు వేసవి శిక్షణా తరగతులు శనివారం ప్రారంభించారు. ఇందులో హెచ్‌ఎం కర్రె పోచయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యం



మల్లికార్జున్‌నగర్‌లో నిర్మిస్తున్న పార్కును కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో ఆహ్లాదకరమైన వాతావరణం తీసుకురావడానికి పార్కులు అభివృద్ధి చేస్తున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. శనివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి మల్లికార్జున్‌నగర్ కాలనీలో నిర్మిస్తున్న పార్కు అభివృద్ధి పనులు పరిశీలించి మాట్లాడారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, విఠల్, బాల్‌రెడ్డి, బలరాం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన కాలువ పరిశీలన

- హద్దులు గుర్తింపు



వెల్దుర్తి శివారులోని హల్దీ ప్రాజెక్ట్ ఎడమ కాలువ హద్దులు ఏర్పాటు చేస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

వెల్దుర్తి, మే 3 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి గ్రామ శివారులోని హల్దీ ప్రాజెక్ట్ ఎడమ కాలువ ఆక్రమణకు గురైంది. ఆక్రమణకు గురైన కాలువను ఇరిగేషన్ డీఈఈ రాజేందర్, ఏఈ శ్రీకాంత్, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ శనివారం పరిశీలించి, సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈఈ మాట్లాడుతూ... హల్దీ ప్రాజెక్ట్ ద్వారా వెల్దుర్తి మండలంలోని ఆయా గ్రామాలతో పాటు కుకునూర్ వరకు ప్రాజెక్ట్ నీళ్లు ప్రవహిస్తాయన్నారు. వెల్దుర్తి శివారులోని కాలువను కొంతమంది ఆక్రమించడంతో విస్తీర్ణం తగ్గిపోయిందని, కాలువను ఆక్రమించిన వారికి ఇటీవల నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బందితో కలిసి సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన

తూప్రాన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనాన్ని జిల్లా న్యాయాధికారి నీలిమ శనివారం పరిశీలించారు. తూప్రాన్ పట్టణానికి జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ద ఫస్ట్‌క్లాస్ కోర్టు మంజూరైంది. కోర్టు ఏర్పాటుకు మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనం ప్రతిపాదనలు చేశారు. ఇందులో భాగంగా ఆమె భవనాన్ని పరిశీలించారు. 15 రోజుల్లో స్వాధీనం చేసుకోవాలని సూచించగా.. ఏర్పాట్లు చేస్తామని ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆమె వెంట డీఎస్పీ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్ఐ శివానందం పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన

అల్లాదుర్గం, మే 3 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తులను ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ జిల్లా అధికారి తలారి వీరేశం శనివారం పరిశీలించి, మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 30 మంది నిరుద్యోగ యువతీ, యువకులు రాజీవ్ యువ వికాసం పథకం కోసం అర్జీలు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు: ఏడీఏ

హత్నూర, మే 3 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జోగిపేట ఏడీఏ రమాదేవి హెచ్చరించారు. హత్నూర మండల పరిధిలోని కాసాల రైతువేదికలో శనివారం ఎరువుల దుకాణాల డీలర్లతో సమావేశమై మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ రానున్నందున ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా చూడాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు కచ్చితంగా బిల్లులు ఇవ్వడంతో పాటు రికార్డుల్లో పొందు పర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు, వ్యవసాయ విస్తరణ అధికారులు మహేందర్, రమేష్, మనీషా, డీలర్లు పాల్గొన్నారు.

'పుస్కల్'తో రైతులకు మరిన్ని సేవలు

జహీరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి) : రైతుల ప్రయోజనార్థం జహీరాబాద్‌లో ఏర్పాటుచేసిన పుస్కల్ అవుట్‌లెట్ ఏజెన్సీతో ఎంతగానో ఉపయోగపడుతుందని పుస్కల్ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో పుస్కల్ అవుట్‌లెట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పుస్కల్ ద్వారా రైతులకు వ్యవసాయ రంగంపై అవగాహన కల్పిస్తూ.. ఏ సమయంలో ఎలాంటి రసాయన ఎరువులు, ఏ మోతాదులో వాడాలని సూచనలు చేశాకే అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో పుస్కల్ సంస్థ అధికారులు హరీశ్, నర్సింహారావు, శివసాగర్ బాబు, రాజేష్‌బాబు, చంద్ర ఓగులయ్య పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు మేలు జరిగేలా చూడండి

జహీరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటలను సాగుచేసే రైతులకు మేలు జరిగేలా చూడాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలో భారత వ్యవసాయ పరిశోధనా మండలి ద్వారా వ్యవసాయం రంగం అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఇందులో దిడిగి-అల్గోల్ శివారులో గల కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం) శాస్త్రవేత్తలు పాల్గొని మంత్రి ప్రసంగాన్ని విన్నారు. ఉద్యాన పంటల్లో మెరుగైన పద్ధతులపై అధ్యయనం చేస్తూ పరిశోధనా ఫలితాలను రైతులకు చేరేలా చూడాలని తెలిపారన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుల ఎన్నిక

నారాయణఖేడ్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మున్సిపాలిటీతో పాటు అసెంబ్లీ నియోజకవర్గంలోని మండలాలకు బీజేపీ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. బీజేపీ అధ్యక్షురాల వివరాలు.. కురుమ దశరత్(నారాయణఖేడ్), ఎన్నం అనిల్‌రెడ్డి(కల్హేర్), బి.శంకర్‌పాటిల్(సిర్గాపూర్), బాబ్యానాయక్(నిజాంపేట), ఎన్.సచిన్‌స్వామి(కంగ్టి), ఎన్.రాజశేఖర్‌పాటిల్(నాగల్‌గిద్ద), పి.చంద్రకళ(మనూరు), బి.శ్రావణ్‌కుమార్(పెద్దశంకరంపేట) నియమితులయ్యారు. బీజేపీ ఖేడ్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా రాజశేఖర్‌గౌడ్‌ను నియమించారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా గోకుల్ అశోక్‌గౌడ్, రాజు, రాజ్‌కుమార్, చిల్కహన్మండ్లు, జన్వాడ మధు, రాజేష్ స్వాల్, ఈశ్వరప్ప, అనిల్‌కుమార్ నియమితులయ్యారు.

సీనియర్లను విస్మరించి, కొత్తవారికి పదవులా..?

అల్లాదుర్గం, మే 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ అభ్యున్నతి కోసం చాలా కాలం నుంచి పనిచేసిన సీనియర్ నాయకులను కాదని కొత్తవారికి బీజేపీ మండల అధ్యక్ష పదవులు ఎలా ఇస్తారని బీజేపీ మండల సీనియర్ నాయకులు కంచరి బ్రహ్మం, కృష్ణ, మారుతి అసహనం వ్యక్తం చేశారు. శనివారం అల్లాదుర్గంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్ష పదవిని మండల నాయకులకు కానీ, కార్యకర్తలకు కానీ సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా ఎలా ఇస్తారని వారు ప్రశ్నించారు. ఈ విషయమై అధిష్టానం పునఃపరిశీలించుకోవాలన్నారు. ఈ సమావేశంలో బూత్ అధ్యక్షులు శంకర్, నరేందర్, శ్రీకాంత్, గణపతినాయక్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కొండాపూర్: విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తున్న కందాడై వరదార్యులు, భక్తులు

పెద్దశంకరంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోదా సహిత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు.

నేత్రపర్వంగా ఉత్సవం

మెదక్ అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీవారి 35వ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం శ్రీనివాస పద్మావతి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరేంద్రఆచార్య ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు పవిత్ర జలాలతో అభ్యంగన స్నానమాచరింపజేశారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు సతీమణి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ కౌన్సిలర్లు కల్యాణి, లక్ష్మి, ఆర్కెశ్రీను, లక్ష్మీనారాయణగౌడ్, పట్టణ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన

రేగోడు, మే 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోనే ప్రసిద్ధిచెందిన రేగోడు బ్రహ్మంగారి మఠం ఆరాధన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం బ్రహ్మంగారి, శరభాక లింగమయ్య ఆలయాల వద్ద ధ్వజ స్తంభాల ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. దీంతోపాటు కాలభైరవ, సుబ్రహ్మణ్యస్వామి, ఈశ్వరీదేవి, దత్తాత్రేయులు, ఆదిశంకరాచార్యులు, శివలింగం, నంది, నాగులు విగ్రహాలకు వీరబ్రహ్మేంద్ర శైవగామ వేదసంస్కృత పాఠశాల నిర్వాహకులు అప్పసముద్రం చంద్రశేఖరచార్యులు, పూజారి శివకుమార్‌చారి ఆధ్వర్యంలో పూజలు జరిపించారు. రాయికోడ్ పీసీసీ మెంబర్ మున్నూరు కిషన్ ఆధ్వర్యంలో అన్నదాన నిర్వహించారు.

లక్ష్మీనారాయణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం


కొండాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మారేపల్లి లక్ష్మీనారాయణస్వామి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం సంగారెడ్డిలోని వైకుంఠపురం ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కందాడైవరదాచార్యుల పరివేక్షణలో ఉత్సవ విగ్రహ ప్రతిమలకు ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామివార్లను పల్లకీసేవలో ఊరేగింపుగా తీసుకొచ్చారు.

రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవం

పాపన్నపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఎల్లాపూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ సిద్ధ యోగ వార్షికోత్సవం ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం మిద్దె రామాగౌడ్ కళా బృందంచే ఒగ్గుకథ చెప్పిస్తామన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నిజాంపేట: సేవాలాల్‌మహరాజ్ ఆలయ వార్షికోత్సవానికి హాజరైన మైనంపల్లి హన్మంతరావు

పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం

నిజాంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కల్వకుంటలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే హన్మంతరావు హాజరై పూజలు చేసి మాట్లాడారు. అలాగే జెడ్ చెరువుతండాలోని సేవాలాల్ మహరాజ్ ఆలయ వార్షికోత్సవానికి హాజరై పూజలు చేశారు. ఆయన వెంట ముత్యంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, పంజా మహేందర్, నసీరోద్దీన్ పాల్గొన్నారు.